# ఆడపిల్ల అంతరాత్మ

"నువ్వింకా పెళ్ళెప్పుడు చేసుకుంటా వోయ్?"

" 'పెళ్ళ'నేమాట నాకు 'బలి' అన్నట్టు వినబడు తుంది"

"అయితే ఒకసారి చెవులు పరీక్ష చేయించుకో!"

"చేయించుకుందును గానీ, మిగతావన్నీ బాగానే వినబడుతున్నాయి"

"అయితే తలకాయ పరీక్షకి పంపు!"

"లాభంలేదు. దాన్ని న్యాయంగా పరీక్ష చేసే దెవరు? పెళ్ళిచేసుకున్న డాక్టర్లేగా?"

"అయితే .... పెళ్ళేచేసుకోవా?"

"చేసుకోకపోదునుగానీ, పెళ్ళి లేకండా నాతో ఉండటానికి ఏ ఆడపిల్లా వొప్పుకోదు"

"వొప్పుకుంటే అలా వుంచుకుంటావన్న మాట!"

"నే నుంచుకోటం కాదు. నన్నే వుంచు కుంటే ఆనందిస్తా."

"వెధవ కబుర్లకేం గానీ, చెప్పవోయ్! పెళ్ళెప్పుడు చేసుకుంటావు?"

"చేసుకుంటా. ఎందుకో చెప్పు!"

"ఎందుకేమిటి? సుఖపట్టానికి."

"అబ్బా! అంత సుఖపడతాం అన్న మాట!"

"అసలు నీకీ వైరాగ్యం ఎలా వచ్చింది?"

"వైరాగ్యం అనకు. అడిగింది చెప్పు!"

"ఏం సుఖపడక? చాలా సుఖపడతాం."

"ఇద్దరూనా? ఒక్కరేనా? ఇద్దరూ సుఖపడుతోన్న వాళ్ళు నాక్కనపళ్ళేదులే. భార్యో — భర్తో — ఒకరు తప్పకుండా పెళ్ళికి బలైపోతూ వుంటారు."

"నేను చూసిన వాళ్ళూ, ఎరిగిన వాళ్ళూ అందరూ ఆనందంగానే వున్నారే!"

"ఏ మూలా మనసుని చంపుకోకుండా, ఎన్నడూ రాజీ పడకుండానే అంత ఆనందంగా వున్నారా?"

"పడితే పడతారు. ఇద్దరు వ్యక్తులు కలిసి బతకా లంటే, రాజీ లేకండా బతకాలనుకోటం ధర్మమా?"

"జీతం సరిగ్గా తెచ్చిందో లేదో లెక్క పెట్టుకునే మొగుడితోటీ, తల్లికి పది రూపాయలు పంపితే పోట్లాడే పెళ్ళాంతోటీ కూడా రాజీ ధర్మాన్నే పాటిం చాలా?"

"ఎక్కడో చెత్త సంగతులు తీసుకురాకు, నీ సపోర్టుకోసం! అందరి మాటా కాదు, నీ మాట చెప్పు!"

"అందరి మాటా నాకు తెలీదు. అసలు లోపం మనుషుల్లోనే వుందోయ్! పెళ్ళిలో లేదు. రెండు గాడిదలకి పెళ్ళిచేస్తే అవి చక్కగా ప్రేమతో చాలా సుఖపడతాయి. ఇద్దరి మనుషులకు పెళ్ళిచేస్తే, అబ్బే! లాభంలేదు. హోప్‌లెస్! నరకానికి కొత్తదారులు కని పెడతారు."

"అసలు నీ కిలాంటి అభిప్రాయం ఎందుకేర్ప డిందో ఆశ్చర్యంగా వుంది!"

"అసలు నీ కిలాంటి అభిప్రాయం ఎందుకేర్పడ లేదో నాకూ ఆశ్చర్యంగానే వుంది!"

"పోనీ అందరిగోలా ఎందుకు? నువ్వు జ్ఞాన వంతుడివిగా? పెళ్ళిచేసుకుని తెగ సుఖపడరాదూ?"

"పడాలనే వుంది. వొచ్చే వ్యక్తి పడనివ్వాలిగా?"

"చాల్లేవోయ్! పెద్ద వూడిపడ్డట్టు మాట్లాడతావు. నీ మాత్రం జ్ఞానం, ఆదర్శం, ఏ ఆడపిల్లకీ వుండ వంటావా?"

"అవన్నీ కోరటం అత్యాశేగానీ, ఓ చిన్న అంత రాత్మ వున్న పిల్లని చూపించు! సంతోషిస్తాను. ఆమె ఇష్టపడితే పెళ్ళిచేసుకుంటా."

"ఏమిటీ, అంతరాత్మా? అదెలా వుంటుంది?"

"ఇక నీకు చెప్తే ఏం తెలిసి ఛస్తుందిలే."

"అబ్బ! చెప్పవోయ్! అంతరాత్మ వుండడం ఏమిటి!"

"అయితే ఓ స్టోరీ చెబుతా విను!"

"స్టోరీయా! జరిగిందా?"

"అక్షరం .... అక్షరం .... జరిగింది."

"మరి చెప్పవేం? చెప్పు మరీ? ఇంతసేపా?"

"ఓ ఏడాది కిందట — శోభ అనే అమ్మాయితో పరిచయం అయింది నాకు, మా కజిన్ ద్వారా"

"ఆహా! ఆడపిల్ల కథేన్న మాట! మధ్య ఆ కజినెందుకూ?"

"ఉండాల్లే. మా కజిన్‌కి కూడా కొంచెం పాత్ర వుంది కథలో. వాళ్ళిద్దరూ క్లాస్‌మేట్స్, నే నిక్కడికొచ్చిన కొత్తలో మా కజిన్ వాళ్ళింట్లోనే వున్నాను మూడు నెలలు. అప్పుడు శోభ మా కజిన్ దగ్గిరికి వొస్తూవుండేది. తర్వాత, ఈ రూమ్ తీసుకున్నాననుకో."

"సర్లే, నీ సోదెందుకు? శోభ సంగతి చెప్పు! అందంగా వుంటుందా? నువ్వు ప్రేమించేశావా?"

"అందమా? ఏమో, నాకు తెలీదు. అందర్లాగే వుంటుంది. ప్రేమంటావా? అబ్బే! అంత తొందరగానా? .... ఇరవై ఏళ్ళ వయస్సులో అయితే చూడ ముచ్చటగా వున్న ఆడపిల్లల్ని చూస్తే సంతోషం కలిగేది. కానీ .... తర్వాత .... తర్వాత .... ఉత్త అందానికి లొంగటం లేదు మనసు. మొండికెత్తింది బొత్తిగా."

"ఉత్త అందం ఏమిటి, గట్టి అందం ఏమిటీ? చెప్పరా నాయనా చంపక. శోభని ప్రేమించనే లేదా, వెధవ కథా నువ్వూనూ?"

"ఆడపిల్ల కథయితే మాత్రం .... అంత కొట్టుకు చచ్చి గీ పెట్టాలటోయ్? అలా అయితే రోజుకోమాట చొప్పున చెబుతా."

"బాబ్బాబు! అంత పని చెయ్యకు. శోభ పేరెప్పుడెత్తావో అప్పుడే పోయింది నా ప్రాణం. ముందు కథ కానీ, పోనీ శోభ నిన్ను ప్రేమించిందా?"

"లేదురా బాబూ! అసలు ప్రేమ సంగ తెత్తకు, వొళ్ళు మండుతోంది నాకు. సినిమా ప్రేమనుకున్నావా నాది కూడా, మొదటిరీల్లో ప్రేమింకోడానికి?"

"పోనీలేవోయ్! చివరి రీల్లో ప్రేమిద్దువుగానిలే. తెలీక అనేశా. అయితే శోభకీ నీకూ ఉత్త చచ్చు స్నేహం అన్నమాట! ఏడిసి నట్టుంది!"

"తర్వాత ఏడిసినట్టుండదులే! శోభని స్టడీ చెయ్యగా .... చెయ్యగా .... చెయ్యగా ఆ పిల్లకి వెన్నెముక వున్నట్టే నమ్మకం కుదిరింది."

"అదేవిటి! శోభకేగాని .... ఇంకెవరికీ వెన్నెముక లుండవేమిటి?"

"సరిపోయింది! నీకు తెలీదన్న మాట! ఆడవాళ్ళకి వెన్నెముక లుండవు! గుండెకాయ లుండవు! అంతరాత్మ లుండవు! రక్త నాళాలుండవు! రొండో మూడో వున్నా అందులో రక్తం ప్రవహించదు!"

"మరేం ప్రవహిస్తుందీ?"

"అదేవిటో ఇంకా ఎవ్వరూ కనిపెట్టలేదు."

"అయితే ఆడవాళ్ళకి ఏవీ లేకపోతే ఇంకేం వుంటుంది?"

"ఉత్త అందం! అదొక్కటే గొప్పనుకుని మురుస్తారు."

"ఓహో! శోభ కొక్కదానికే వెన్నెముక వుందన్న మాట! ఎలా తెలిసిందీ?"

"ఎలా ఏఁవిట్లే, అప్పుడప్పుడూ మాటల్లో .... నవ్వుల్లో .... ధైర్యంలో .... నిర్లక్ష్యంలో ...."

"సర్లే! ఆ వెన్నెముకనన్నా ప్రేమించావా?"

"కొంచెం ఆశ కలిగిందిలే ...."

"నీ ప్రేమ చెప్పావా?"

"అప్పుడే? ఇంకా అంతరాత్మ వుందో లేదో తేలందే!"

"ఓహో! అదొకటి కదూ? తేలిందా?"

"తేలుతోంది, మునుగుతోంది, ఇలా లాభం లేదని నేనే అడిగేశా!"

"ఏమనీ? 'శోభగారూ! మీకు అంతరాత్మ వుందాండీ' అనా?"

"నోరుముయ్యవోయ్! చెప్పేది విను! 'జీవితం గురించి మీ కెలాంటి కోరికలు ఉన్నాయి?' అని అడిగా."

"అంతరాత్మకీ, కోరికలకీ సమ్మంధం ఏవిట్రా నాయనా?"

"నీకు తెలిసేడవదులే .... 'సుఖంగా బతకడమే నా కోరిక' అంది."

"భలే చెప్పిందిలే! మా బాగా చెప్పింది."

"సుఖం అంటే ఏమిటి — అన్నా.

నవ్వి — 'సుఖం అంటే సుఖమే' అంది.

'సరే! మీ సుఖానికెవరైనా అడ్డొస్తే? మీరు సుఖం అనుకున్న దాని కెవరైనా ఆటంకాలు కల్పిస్తే?' అన్నా."

"ఏమందీ?"

"ఒక్క క్షణమన్నా తట పటాయించకుండా— 'నా అంతరాత్మ చెప్పినట్టే నడుచుకుంటా' అంది."

"ఎగిరి గంతేశావా?"

"'హా! నా స్వప్నసుందరీ!' అని మోకరిల్లాను."

"చెంపమీద కొట్టిందా?"

"అంతదృష్టం పట్టలేదు."

"అర్జంటుగా చెప్పు! తర్వాతేమైంది? ప్రేమిం చేశావు కదూ?"

"ఆమె మనసులో నాకు కొంచెం చోటు దొరుకు తుందేమోనని తపస్సు ప్రారంభించాను. నా తపస్సింకా పూర్తికాక ముందే ...."

"ఒప్పేసుకుందా?"

"తంతానిక! చెప్పనివ్వవేం?"

"అబ్బా, తొందరగా చెప్పు, మాట్లాడన్లే."

"హఠాత్తుగా ఓ రోజు మా కజిన్ చెప్పింది — శోభకి పెళ్ళని."

"పెళ్ళా? శోభకా? ఏడ్చెయ్య లేదూ నువ్వు?"

"నిజంగా ఏడుపొచ్చిందోయ్! కానీ మా కజిన్ చెప్పిన విషయం వింటే ఫకాల్న నవ్వొచ్చింది!"

"భలేగుందే! ఎందుకూ నవ్వు? ఇదేం కథరా బాబూ? పిచ్చెత్తిందా నీకు?"

"మంచి సంబంధం వచ్చిందట! అందుకని చదువు మానేసి పెళ్ళికి వొప్పేసుకుందట!"

"అవును మరి, ఆడపిల్లకి .... అంత కన్నా ...."

"ఛీ! నోర్ముయ్ గాడిదా!"

"అబ్బ! బొత్తిగా అల్లా తిట్టకోయ్."

"అసలు మంచి సంబంధం అంటే ఏవిటని అడగవేం?"

"అదీ నువ్వే చెప్పు!"

"అతను డాక్టరు. కారుంది. వాళ్ళ నాన్న ఏదో ఆఫీసరు. అతనికీ కారుంది."

"రెండు కార్లున్న సమ్మంధం మంచిది కాదా?"

"అంతేకాదు. వరుడి నాన్న తోడల్లుడి మేనల్లుడి కేదో గొప్ప కంపెనీ వుంది."

"ఓహో! అయితే ఈ సమ్మంధానికి కాళ్ళూ చేతులూ కట్టేసి అయినా సరే పెళ్ళి చెయ్యాల్సిందే!"

"నే నలాగే అనుకున్నాను. ఇదేదో బలవంతం వ్యవహారమేమోనని. ఇంత కాలానికి నాకు శోభ దొరికి నట్టే దొరికి మాయం అయిపోతోందంటే చాలా బాధ కలిగింది. నా మనసంతా చెప్పి ఆమెని దక్కించుకోవా లనే ఆరాటంతో బయల్దేరాను. నా మాటలతో ఆమె అంతరాత్మని మేల్కొల్పగలననుకున్నాను."

"అబ్బ! అసలేమైందో చెప్పి చావవోయ్!"

"కాలేజీ మానేస్తున్నారట! నిజమేనా?" అన్నా, శోభతో.

కొంచెం సిగ్గుపడి — "అవునండీ! మీకు తెలు సుగా? మ్యారేజ్ సెటిలయ్యింది" అంది.

"అసలిప్పుడు మేరేజ్ కెందుకొప్పుకున్నారు? ఇంకో సంవత్సరం పైగా చదు వుంది మీకు. మీరు ఎమ్మేకూడా చదువుతానన్నారు. గుర్తుందా?" అన్నా.

"అవుననుకోండీ. ఎంత చదివినా పెళ్ళి తప్పదు కదా అని మా వాళ్ళంతా అన్నారు" అంది.

"మీ కిష్టంలేదా?"

కొంచెం నవ్వి — "అబ్బే అంత ఇష్టం లేకుండా కాదనుకోండీ. నేనూ వొప్పుకున్నా" అంది.

"నేనోమాట అడుగుతాను, అడగనా?"

"అదేమిటి, కొత్తగా మాట్లాడుతున్నారు? అడగండీ!"

"ఆ ధైర్యంతోటే మాట్లాడుతున్నాను. మిమ్మల్ని ఎంత వరకైనా చదివించగల స్తోమతు వుంది మీ పెద్ద వాళ్ళకి. ఇప్పుడొచ్చిన సంబంధం లాంటిది ఎప్పుడైనా వొస్తుంది మీకు. ఇప్పుడు హఠాత్తుగా చదువుమాని .... కట్నం ఇచ్చి .... పెళ్ళి చేసుకుని .... ఒకసారి .... మీరే మన్నారంటే, ఏదైనా సమస్య వొస్తే అంతరాత్మ చెప్పినట్టే నడుస్తానన్నారు."

ఆమె కొంచెం తెల్లబోయి .... నవ్వింది "అవు నండీ! ఈ విషయంలోనూ నా మనసు చెప్పినట్టే

నడుచుకుంటున్నాను. పెద్దవాళ్ళేం చేసినా నా శ్రేయస్సు కోసమే చేస్తారు కదా? ఎక్కువ చదివి మాత్రం నేనేం ఉద్యోగం చెయ్యాలా? ఆడవాళ్ళు సుఖ పడేది మేరేజ్ లైఫ్‌లోనేగానీ .... డిగ్రీలతో కాదుగదా?" అంది.

అంటే, "చదువొద్దు స్త్రీకి, పెళ్ళి చేసుకో" అందట శోభ అంతరాత్మ! ఎలా వుంది?"

"నా కెంతో ముచ్చటగా వుంది. ఆడ పిల్ల వివేకంగా ఆలోచించుకుని, చదువు మానుకుని, పెళ్ళి చేసుకుని — కాపరం చేసుకుంటానంటే ఏడ్చే వెధవని నిన్నే చూశాను."

"నోరుముయ్యి! నిన్నేం జరిగిందంటే...."

"ఏమిటీ? నిన్నకూడా జరిగిందీ? మరి చెప్పవేం?"

"శోభకి పెళ్ళయ్యి నాలుగు నెలలైంది. నాలుగు రోజుల కిందట శోభా .... వాళ్ళాయినా వొచ్చారని మా కజిన్ చెప్పింది. ఆమె అంతరాత్మని ఓసారి చూద్దామని నిన్న సాయంత్రం వెళ్ళాను. మనిషి ఎంత ఫేషన్‌గా వుందనుకున్నావ్? కొత్త రకం ముడీ! చాలా తెల్ల బడింది. నవ్వుతూనే ఆహ్వానించింది. వాళ్ళ వూరు సంగతులన్నీ చెప్పింది. నా కబుర్లేవో అడిగింది. మాటల మధ్య నేను నా ప్రశ్నలన్నీ అడిగా.

"పెళ్ళయింతర్వాత మీ జీవితం ఎట్లా వుంది?" అన్నా.

షోకుగా నవ్వి — "హేపీగా ...." ఉంది.

"కష్టాలు చెప్పుకుంటుందేమో ఓదార్చుదామని సరదా పడ్డావు కావును."

"ఇలాంటి వాళ్ళకు కష్టాలు రావోయ్! రానివ్వరు. వీళ్ళ కష్టాలు ఉత్త భౌతికం. మానసికమైనవి కావు."

"అదేం రూలు?"

"అది అంతే! విను! 'హేపీగా వుందన్నారు. శాంతిగా కూడా వుందా?' అన్నా.

నవ్వి — "రెండూ వొకటికాదా?" అంది. తర్వాత వాళ్ళాయన కొన్న ఏదో కొత్తరకం నగ చూపించింది. 'అడ్డిగో .... గుండిగో' అని చెప్పింది, రవ్వలో .... మువ్వలో .... ఏవో వున్నాయి దాన్నిండా. ఎంత ధరో చెప్పింది. "బాగుందా?" అంది.

నేను చాలా అజ్ఞానంగా — "నగల సంగతి నాకేం తెలీదండీ!" అన్నా.

కొంచెం నిరాశపడింది.

అంతలో ఒకాయన టకటకా వొచ్చాడు. అతన్ని చూడగానే ఆమె ఎలా మారిందో చెప్తే నేను కల్పించా ననుకుంటావు.

"అనుకోన్లే! చెప్పు!"

"నవ్వు పోయింది. సీరియస్‌గా అయింది. కంగారుగా లేచి నిలబడింది. ఏదో ఫార్మల్‌గా నన్ను తన క్లాస్‌మేట్ అని పరిచయం చేసింది. అతను చాలా నిర్మొహ మాటంగా .... 'ఐసీ' అనేసి .... వెళ్ళిపోయాడు లోపలికి. ఆమె కొంచెం ఇబ్బంది పడుతున్నట్టని పించింది నాకు. ఎలా వ్యవ హరిస్తుందో చూద్దామని అలాగే కూచుని మాట్లాడుతున్నా. నేనంటే ఆమె కెప్పుడూ స్నేహభావమే, సదభిప్రాయమే, నాతో మాట్లాడ్డాని కామె ఎన్నడూ విసుక్కోలేదు. అలాంటి మనిషి హఠాత్తుగా మాట లాపేసి — నవ్వు తెచ్చిపెట్టుకుని — "ప్లీజ్! మనం ఇంకోసారి కలుసుకుందాం" అని లేచింది.

"అలాగే!" అంటూ నేనూ లేచాను.

వెళ్ళి పొమ్మన్నందుకు నేనేమైనా బాధ పడతానేమోనని — "ఏమీ అనుకోకండి. ఇంకోసారి తప్పకుండా కలుసుకుందాం" అంది.

"అబ్బే, అదేం కాదు. కానీ .... నేను మీ క్లాస్‌మేట్‌నని ఎందుకు చెప్పారు?" అన్నా.

"వేరే ఫ్రెండ్ అని చెప్తే బాగుండదు" అంది, నాకు కొంచెమన్నా నిజం చెప్పి .... గాయపరచకుండా పంపాలని కాబోలు.

నేను నవ్వుతూ చనువుగా మాట్లాడినట్టు "అసలు నాలాంటి ఫ్రెండ్స్‌తో మాట్లాడ్డానికి ఆయన వొప్పుకోక పోతే ఏం చేస్తారు" అన్నా.

"ఏం చేస్తాను? ఊరుకుంటాను. ఆయన కిష్టం లేని పనేదీ నేను చెయ్యను సుమండీ! ఆయన్ని ధిక్కరించి చికాకులు తెచ్చుకోడానికి నా అంతరాత్మ వొప్పదు. సుఖంగా ఉండాలి నాకు" అంది.

" 'భగవంతుడా! ఈ స్త్రీలని అంత రాత్మలనించి

.... రక్షించు!' అని అక్కడే బోర్లాపడి ప్రార్థించావా?"

"లేదు. భగవంతుడు రక్షించలేడని నాకు తెలుసు. శోభ నా జీవితంలో ఇంకా దగ్గరగా రానందుకు చాలా సంతోషించాను. మా ఇద్దరికీ గొప్ప మేలు జరిగిందని తుళ్ళుతూ వొచ్చాను."

"పోనీ నువ్వు అయితే ఆమెకి చాలా స్వాతంత్రం ఇస్తావుగా?"

"స్వతంత్రం వొకరి కింకొకరు ఇచ్చేది కాదోయ్! కాళ్ళూ చేతులూ ఎంత స్వంతమో అదీ అంత స్వంతం. జన్మహక్కు! పక్షిని పంజరంలో పెడితే గింజుకుంటుందే — శక్తికొద్దీ పోరాడుతుందే! స్వతంత్రంగా గాలి పీలుస్తూ స్వతంత్రంగా వ్యవహరించాలనే తపన లేని మనుషులు కూడా మనుషులేనా? భర్త రాగానే ఆమె తన స్నేహితుల్ని పంపించేసి అతని సమక్షంలో హాజరై పోవాలా? శోభకి అంతరాత్మ వుందట. కానీ అది భర్తకి అణకువగా ముడుచుకుని, పెంపుడు కుక్కలాగా, ఎదురు తిరగకుండా, ఘర్షణ పడకుండా, సమస్యలు లేపకుండా, కార్ల కోసమో హోదాల కోసమో నగల కోసమో ఆఖరికి ఓ చీర కోసమో వినయంగా పడి వుంటుంది! అబ్బ! ఈ ఆడ వాళ్ళు .... పైపై అందాలు పెంచుకునే పాట్లు పడతారుగానీ .... లోపల ఎంత మురికి జీవితాల్లో అయినా ఇమిడిపోతారు! వాళ్ళని భరించటానికి అంత మురికి మొగాళ్ళే సరిపోతారు. నేను మాత్రం .... ఎప్పుడో .... హఠాత్తుగా ... ఎక్కడో ... నిర్మలంగా ... ఉజ్వలంగా... వెలిగే ఒక చిన్న హృదయం దొరకదా అని నిరీక్షిస్తున్నాను .... ఇంకెంత చెప్పమంటావు? అదీ శోభ కథ!"

"ఏడిసినట్టుంది నీ స్టోరీ! పెళ్ళాం వినయంగా పడివుంటానంటే మొత్తుకునే వెధవని నిన్నే చూశాను. అబ్బే! ఏమిటో అనుకున్నానుగానీ ఈ జన్మలో నీకింకేం పెళ్ళవుతుందీ? వొచ్చే జన్మలో నేనే చేసుకుంటాలే, ఊరుకో!"

"వద్దు నాయనా! నాకీ జన్మంతా నిద్రపట్టదు. బెల్లంపాకం వుడికే మూకుళ్ళెప్పుడన్నా చూశావా?"

"ఎందుకూ?"

"నిన్నూ ఆడవాళ్ళనీ అందులో పారేసి, ఓ బస్తా సోడా పోసి .... ఉడికించి .... బాది .... ఆరేసి .... ఎండబెట్టి .... మడతబెట్టి .... ఇస్త్రీ చేసి ...."

"చాల్లేవోయ్! తెగ పేల్తున్నావు, ఏ పిల్ల చేతిలోనో లెంపకాయలు తింటావు!"

"కృతజ్ఞుణ్ణి స్నేహితుడా!"

[1971 మే "వసుధ" మాసపత్రికలో] ★

# కనిపించుట లేదు!

**నా** భార్య, ముగ్గుల మహలక్ష్మి మొన్న సంక్రాంతి పండుగ తర్వాత 'ముక్కనుము' నాడు హైదరాబాదు నుంచి రథం ముగ్గు వేసుకుంటూ బయల్దేరింది. ఇంతవరకూ ఇంటికి రాలేదు. బహుశా ఇప్పటికి బెజవాడ ప్రాంతాల్లో ఎవరి ఇంటి ముందు నుంచో రథం ముగ్గు లాగుతూ వుండవచ్చును.

ఈ సంక్రాంతి నెలంతా రాత్రింబగళ్ళూ ముగ్గులు పెడుతూ వుండటంచేత నడుం వొరిగిపోయింది. ఎడం చేతిలో తవ్వెడు ముగ్గుపట్టే ముగ్గుబుట్ట (కాయితాల గుజ్జుతో తయారుచేసింది) వుంటుంది. కుడిచేతి వేళ్ళు ముగ్గుతో తెల్లబడిపోయి వుంటాయి. ఆ వేళ్ళతో జుట్టు సర్దుకోడం చేత తల కూడా ముగ్గు బుట్టమల్లే వుంటుంది. ఎవరైనా దగ్గరికి వస్తూంటే ముగ్గు తొక్కుతారేమోనని కోపంగా చూస్తూ వుంటుంది. దూరంగా నిలబడితే ముగ్గు చూశారో లేదోనని దిగాలు పడిపోతూ వుంటుంది.

"ముగ్గు చాలా బాగుంది మాలక్ష్మిగారూ!" అని ఎవరైనా మాట జారారో ఇక ఆ ఉత్సాహంతో ముగ్గుని పెంచుకుంటూ రెండు మూడు ఊళ్ళ వరకూ వెళ్ళిపోతుంది.